కాంగ్రెస్‌లోకి కూన వెంకటేష్‌గౌడ్ కుమారులు?

- త్వరలో రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరిక




కూన శ్రవణ్‌కుమార్‌గౌడ్, కూన గౌరి శంకర్‌గౌడ్

బేగంపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ సీటు గెలిచేందుకు కాంగ్రెస్ అధిష్టానం పావులు కదుపుతోంది. సనత్‌నగర్, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో అభిమానులు.. అనుచర వర్గం ఉన్న కూన వెంకటేష్‌గౌడ్ ఫ్యామిలీని పార్టీలో చేర్చుకోవడం ద్వారా అటు బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ ఓట్లను కొల్లగొట్టడంతో పాటు సనత్‌నగర్‌లో పార్టీ బలపడుతోందని భావించిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు కూన వెంకటేష్‌గౌడ్ కుటుంబాన్ని పార్టీలోకి ఆహ్వానించారు. ఫిబ్రవరి నుంచి వీరితో కాంగ్రెస్ పార్టీ నేతలు టచ్‌లో ఉన్నారు. కొంత కాలంగా కూన వెంకటేష్‌గౌడ్ అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా ఈ విషయం ముందుకు సాగలేదు. రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిత్రుడు వేంనరేందర్‌రెడ్డితో కూన వెంకటేష్‌గౌడ్ కుమారులు కూన శ్రవణ్‌కుమార్‌గౌడ్, గౌరి శంకర్‌గౌడ్ భేటీ అయ్యారు. ఈసందర్భంగా పార్టీలో చేరాలని ఆయన సూచించడంతో అంగీకారం తెలిపారు. వీరిని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకురావడంలో ప్రస్తుత సికింద్రాబాద్ పార్టీమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ కీలక పాత్ర పోషించారు. ఈకుటుంబానికి సనత్‌నగర్ నియోజకవర్గంలో మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. 2008లో రాజకీయాల్లోకి వచ్చిన కూన వెంకటేష్‌గౌడ్ ప్రజారాజ్యం పార్టీ నుంచి 2009లో కూకట్‌పల్లి నుంచి పోటీ చేశారు. అప్పట్లో రంగారెడ్డి జిల్లా పార్టీ కన్వీనర్‌గా వ్యవహరించారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరి 2014 ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. 2018 ఎన్నికల్లో సనత్‌నగర్ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీలో నిలిచారు. అనంతర పరిణామాల్లో 2020లో టీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి ఆయన ఆరోగ్యం సరిగా లేకపోవడంతో రాజకీయాలకు దూరంగా ఉన్నారు. 2022లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పిలవడంతో ఆయన మీద అభిమానంతో సుమారు 100 కార్లతో ర్యాలీగా విజయవాడకు వెళ్లి పార్టీలో చేరారు. ఈక్రమంలో ఆయన ఆరోగ్యం సహకరించక పోవడంతో రాజకీయాలకు దూరంగా ఉన్నారు. గతంలో టీడీపీలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డితో కూన వెంకటేష్‌గౌడ్‌కు మంచి సాన్నిహిత్యం ఉండేది. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కూన వెంకటేష్‌గౌడ్ కుమారులు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



బచ్చల లోకేష్

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను మధురానగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 200గ్రాముల గంజాయి, తూకం మిషన్, 2సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని గుర్తుతెలియని వ్యక్తుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు పలుచోట్ల నిఘా ఏర్పాటుచేశారు. ఈనెల 19న రాత్రి సమయంలో కృష్ణకాంత్ పార్కు సమీపంలో సులేమాన్, జి.ఆదిత్య వారికి అనుమానాస్పదంగా కనిపించా రు. అదుపులోకి తీసుకుని విచారించగా సులభంగా డబ్బు సంపాదించేందుకు గంజాయి అమ్ముతున్నట్లు వారు అంగీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుడు..

సనత్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న భవన నిర్మాణ కార్మికుడ్ని బాలానగర్ ఎస్ఓటీ, సనత్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద 2.30 కిలోల గంజాయి, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన బచ్చల లోకేష్ మోతీనగర్‌లో ఉంటూ భవన నిర్మాణ పనులు చేస్తున్నాడు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు గంజాయి తీసుకోవడం గమనించాడు. గంజాయికి డిమాండ్ ఉందని గమనించి విక్రయాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. కొద్దిరోజుల క్రితం శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం వెళ్లి గంజాయి స్మగ్లర్ సురేష్ వద్ద 2.30 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. ఎర్రగడ్డ ఫ్లైఓవర్ వద్ద శనివారం అనుమానాస్పదంగా తిరుగుతున్న లోకేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోగా గంజాయి కనిపించింది.

పెట్రోల్ బంక్ సిబ్బందిపై దాడి

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పెట్రోలు పోయడంలో ఆలస్యం చేశారన్న కోపంతో ఓ వ్యక్తి బంక్ సిబ్బందిపై దాడి చేశాడు. ఈ నెల 18వ తేదీ రాత్రి శ్రీనివాస్‌నగర్ వెస్ట్ సమీపంలోని భారత్ పెట్రోల్ బంక్‌కు వచ్చిన బంటి వాహనంలో పెట్రోల్ పోయమన్నాడు. భోజనానికి వెళుతున్నానని, పక్కనున్న మరో ఉద్యోగి వద్దకు వెళ్లాలని సనోజ్ అనే యువకుడు చెప్పాడు. ఆగ్రహించిన బంటి నేను బోరబండ రౌడీనని, నేను అడిగితే పెట్రోల్ పోయవా అంటూ సనోజ్‌పై దాడి చేశాడు. అడ్డుకోబోయిన మరో ఉద్యోగి పవన్‌పై కూడా దాడి చేశాడు. బంక్ మేనేజర్ వసంత్‌కుమార్‌తో కలిసి బాధితులు మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అకారణంగా యువకుడిపై దాడి

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అకారణంగా ఓ యువకుడిపై ముగ్గురు దాడి చేశారు. జవహర్‌నగర్‌లో నివాసముండే చరణ్‌తేజ్ ఈ నెల 18న అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. అక్కడ అనిల్, అతని అల్లుడు అరుణ్, అతడి తండ్రి అంతయ్య అకారణంగా చరణ్‌తేజ్‌పై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుడని నమ్మితే మోసం చేశాడు

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బాల్య స్నేహితుడని నమ్మితే మాయమాటలతో మభ్యపెట్టి పలు దఫాలుగా డబ్బు తీసుకోవడమే కాక కులం పేరుతో దూషించాడని ఓ యువతి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈసీఐఎల్‌కు చెందిన ఓ యువతి చిన్నతనంలో రహ్మత్‌నగర్‌లో చదువుకుంది. ఆ సమయంలో యూసుఫ్‌గూడకు చెందిన జోగి శ్రీకాంత్‌తో పరిచయంకావడంతో స్నేహంగా మెలిగింది. 2022లో ఆ యువతి ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్స్‌గా చేరింది. తన నివాసానికి దగ్గరలో ఉన్న ప్రవీణ్‌తో స్నేహంగా ఉండేది. శ్రీకాంత్ కూడా ఈసీఐఎల్‌లో ఉద్యోగంలో చేరాడు. డబ్బులు అవసరం ఉందని శ్రీకాంత్ అడగటంతో యువతి ప్రవీణ్ వద్ద పలు దఫాలుగా రూ.5 లక్షలు తీసుకుని శ్రీకాంత్‌కు ఇచ్చింది. దాంతో పాటు 7 గ్రాముల బంగారం కూడా ఇచ్చింది. డబ్బు, బంగారం గురించి అడిగినప్పుడల్లా శ్రీకాంత్ దాటవేసేవాడు. గత సంవత్సరం నవంబర్ 18న శ్రీకాంత్ యువతిని తన సోదరుడు ధర్మేంద్ర ఇంటికి తీసుకువెళ్లి శారీరకంగా వాడుకున్నాడు. పెళ్లి చేసుకోమని ఒత్తిడి చేయడంతో కులం పేరుతో దుర్భాషలాడాడు. బాధితురాలి ఫిర్యాదుతో మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. .

డాక్టర్ ఇంట్లో చోరీ చేసిన పాత దొంగ రిమాండ్

ఖైరతాబాద్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఓ వైద్యుడి ఇంట్లో చోరీ చేసి పారిపోయిన నిందితుడిని ఖైరతాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. నిమ్స్ ఆస్పత్రిలో పని చేస్తున్న డాక్టర్ ఫరాజ్ అశ్వక్ హబీబ్‌నగర్‌లో ఒంటరిగా ఉంటున్నాడు. ఆయన ఈనెల 15న ఉదయం విధులకు వెళ్లి 16న రాత్రి ఇంటికి చేరుకునేసరికి తలుపులు తీసి ఉండడం గమనించాడు. అనుమానంతో లోనికి వెళ్లి చూడగా ఇంట్లో డబ్బులున్న తన పర్సు, లాప్‌టాప్, విలువైన వస్తువులతో పాటు ఏటీఎం కార్డులు, ధ్రువీకరణ పత్రాలు కనిపించలేదు. దీంతో ఆయన ఈనెల 17న ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీసీ కెమెరాలు, ఇతర ఆధారాలతో దొంగతనం చేసింది పాతనేరస్థుడు హబీబ్‌నగర్‌కు చెందిన మహమ్మద్ మాజిద్(29) గా గుర్తించి విచారించగా చోరీ చేసినట్టు అంగీకరించాడు. నిందితుడి నుంచి కొంత నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకోగా ఏటీఎంతో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాలను పారవేశానని చెప్పాడు. నిందితుడిని శనివారం రిమాండ్‌కు తరలించారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

సనత్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌టీ కాలనీకి చెందిన రాకేష్ కిరణ్(37) ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతడికి 4నెలల క్రితం వివాహమైంది. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడం, చిట్టీల వ్యాపారం చేసేవాడు. ఈ క్రమంలో నష్టాలు రావడంతో అప్పులు చేశాడు. తీర్చలేక ఇంట్లో విషం తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అధిక వడ్డీకి అప్పు ఇచ్చిన వారి వేధింపులవల్లే కిరణ్ ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులు ఆరోపించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి తెలిపారు.

వేధింపులకు పాల్పడితే శిక్షించాలి : డాక్టర్ కోట నీలిమ

రాకేష్ కిరణ్ కుటుంబాన్ని శనివారం సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాకేష్ కిరణ్ ఆత్మహత్యకు కారకులైన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అధిక వడ్డీలు వసూలు చేసే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాకేష్ కిరణ్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

బంగారు భవిష్యత్‌కు కృషి

- ప్రజాపాలన దరఖాస్తు దారులందరికీ పథకాలు
- ఇందిరమ్మ కమిటీల ద్వారా ప్రతి ఒక్కరికీ న్యాయం
- ఐదేళ్లలో కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ అభివృద్ధికి ఒక్క రూపాయీ తేలేదు
- స్థానిక ఎమ్మెల్యే రౌడీలను పెంచి.. అమాయకులపై కేసులు పెట్టించారు
- పోపు డబ్బాలకు ఆశపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు
- సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్




సమావేశానికి హాజరైన కార్యకర్తలు, మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన దరఖాస్తు దారులందరికీ పథకాలు అందిస్తామని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే ఐదు గ్యారెంటీలు అందాయని, భవిష్యత్‌లో ఇళ్లు లేనివారికి ఇళ్లు, స్థలం ఉన్నవారికి ఇళ్లు కట్టుకునేందుకు డబ్బులు, పది లక్షల ఆరోగ్య బీమా అందించి ప్రజల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన చెప్పారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని దానం నాగేందర్ కోరారు. శనివారం యూసుఫ్‌గూడలోని మహమూద్ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ నాయకుడు వి.నవీన్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రాష్ట్రానికి ఏమీ చేయలేదని అన్నారు. ఐదేళ్లలో కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్‌కు ఒక్క రూపాయి కూడా తేలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు ఏమి మాట్లాడుతున్నారో వారికే తెలియడంలేదని ఆయన అన్నారు.

రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు

స్థానిక ఎమ్మెల్యే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రౌడీ షీటర్లను పెంచాడు... అమాయకులపై కేసులు పెట్టించాడు... ఇక్కడ పోలీస్‌స్టేషన్‌లలో ఎప్పుడు చూసినా ఎమ్మెల్యే పెట్టించిన కేసుల గోలే ఎక్కువగా ఉంటుందన్నారు. ఏదైనా ఉంటే బేగంబజార్ పోయి హోల్‌సేల్‌లో డబ్బాలు కొనకొస్తాడని, ఆ పోపు డబ్బాలకు ఆశపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ప్రజలకు సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అనేక సంక్షేమ పథకాలు అందించి మీ జీవితానికి బంగారు బాటలు వేసేందుకు కృషి చేస్తున్నారని దానం నాగేందర్ ప్రజలకు సూచిం చారు.

ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచాను..

ప్రజాపాలనలో వచ్చిన 64వేల దరఖాస్తు దారులకు ఏ పథకానికి అర్హులైతే ఆ పథకం తప్పక అందిస్తామన్నారు. తాను ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని, ఎక్కడున్నా ప్రజల వెంట ఉన్నానేకానీ ఏ రోజూ ఒక్కరిపై కేసు పెట్టలేదన్నారు. ప్రజలకు నిరంతరంగా ఉన్నాను కాబట్టే ప్రజలను తనను ఆదరించారన్నారు. ఈ ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేసేలా అందరం కలిసి కట్టుగా కృషి చేసి విజయం సాధిద్దామని దానం నాగేందర్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ గెలుపును రేవంత్‌రెడ్డికి అందించి ముందుకు పోదామన్నారు.

● రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ... రాష్ట్రానికి బీజేపీ ఏమి చేసింది, ఐదేళ్లలో కిషన్‌రెడ్డి ఎందుకు నిధులు తీసుకురాలేదో చెప్పాలన్నారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడగడానికి వస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకుడు నవీన్‌యాదవ్ మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో మహిళలు ముందుండి ప్రచారం చేసి మన భవిష్యత్‌ను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ అజారుద్దీన్, చిన్నశ్రీశైలం యాదవ్, ఉపేందర్‌రెడ్డి, భవానీశంకర్, కార్పొరేటర్లు సీఎన్‌రెడ్డి, బాబా ఫసియుద్దీన్, వనం సంగీతయాదవ, నాయకులు మురళిగౌడ్, మైనార్టీ నాయకుడు ఖురేషి, షరీఫ్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు'

పంజాగుట్ట: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, గిరిజనులు కాంగ్రెస్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని గిరిజన శక్తి పిలుపునిచ్చింది. గిరిజన శక్తి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి డి.రవీంద్ర నాయక్, సంస్థ అధ్యక్షుడు శరత్ నాయక్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంలో బంజారా సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ గిరిజనులకు ఏమి చేయలేదన్నారు. కేసీఆర్ హయాంలో నియంత పాలనను భరించలేకే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లేనని, రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీజేపీ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు.

బీజేపీకి దూరంగా జనసేన!

- సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో స్తబ్దుగా ఉన్న జనసేన నేతలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): బీజేపీకి, జనసేన పార్టీకి మధ్య దూరం పెరిగిందా అంటే.. అవుననే అంటున్నారు జనసైనికులు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ నేతలు, జనసేన నేతలు కలిసి ప్రచారం నిర్వహించగా, మే 13న జరగనున్న సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో మాత్రం రెండు పార్టీలు ఎవరి దారి వారిదే అన్నట్టుగా వ్యవహరిస్తుండడం గమనార్హం. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీజేపీ తో కలిసి ప్రచారంలో పాల్గొనేందుకు జనసేన నేతలు, కార్యకర్తలు ముందుకు వచ్చినప్పటికీ, కమలం పార్టీ నేతలు తగురీతిన ఆహ్వానం అందలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాక్షాత్తు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రాతినిథ్యం వహిస్తున్న సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోనే తాము ఆ పార్టీతో కలిసి పనిచేసే పరిస్థితులు ఏర్పడకపోవడంపై కొందరు జనసేన నేతలు బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ఎన్నికల్లో బీజేపీతో కలిసి పనిచేసే విషయమై తమ పార్టీ అధిష్టానం నుంచి ఆదేశాలు అందకపోవడం వల్లనే జనసేన నేతలు స్తబ్దుగా ఉన్నట్టు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

2019లో జనసేన అభ్యర్థికి 10 వేల ఓట్లు!

గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి జనసేన పార్టీ సొంతంగా అభ్యర్థిని నిలిపింది. ప్రస్తుత ఆ పార్టీకి తెలంగాణ ఇన్‌చార్జిగా ఉన్న ఎన్.శంకర్ గౌడ్ గత ఎన్నికల బరిలో నిలవగా ఆయనకు 9,683ఓట్లు వచ్చాయి. ఈ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని సికింద్రాబాద్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, నాంపల్లి, సనత్‌నగర్, ముషీరాబాద్ ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి సెటిలైన వారు చెప్పుకోదగిన సంఖ్యలో ఉన్నట్టు తెలుస్తోంది. ఏపీ ఓటర్లతో పాటు తెలంగాణలోనూ మెగా కుటుంబానికి, జనసేనానికి పెద్దసంఖ్యలో అభిమానులు ఉన్నారని, గత ఎన్నికలతో పోల్చితే ఈ దఫా జనసేన పార్టీ మద్దతుదారుల సంఖ్య బాగా పెరిగిందని జనసేన నేతలు భావిస్తున్నారు. మొత్తంగా సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో కలిపి 40 నుంచి 50వేల మంది జనసేనకు మద్దతు తెలిపే వారున్నట్టు అంచనా వేస్తున్నారు. బీజేపీ నుంచి జనసేన నేతలకు సరైన పిలుపులు లేకపోవడంతో జేఎస్‌పీకి మద్దతు తెలిపేవారంతా చీలిపోయి బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు వేసే పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం సికింద్రాబాద్ పార్లమెంట్‌కు నెలకొన్న ముక్కోణపు పోటీలో బీజేపీ అభ్యర్థికి జనసేన మద్దతుదార్ల ఓట్లు ఎంతో అవసరమని, ఇప్పటికైనా తమను కలుపుకొని ముందుకు వెళ్లకుంటే గెలుపుపై ప్రభావం చూపే అవకాశం ఉందని జనసేన పార్టీ సీనియర్ నేతలు అంటున్నారు.

ఏపీ ఎన్నికలపై తెలంగాణ జన'సేన' ఫోకస్

సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ, జనసేన నేతలను పట్టించుకోక పోవడంతో.. ఈ నియోజకవర్గం పరిధిలోని జేఎస్‌పీ మద్దతుదారులు ఏపీలో జరగబోయే ఎన్నికలపై ఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో 20కిపైగా అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ స్థానాల్లో జేఎస్‌పీ పోటీ చేస్తుండంతో.. ఆయా నియోజక వర్గాల్లో జనసేన అభ్యర్థుల గెలుపుకోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా పనిచేస్తున్నట్టు సమాచారం. ఏపీలో జనసేన గెలుపుకోసం తెలంగాణ ప్రాంతానికి చెందిన జనసైనికులు కూడా ఆసక్తిగా పనిచేస్తున్నట్టు స్థానిక నేతలు చెబుతున్నారు. మరోవైపు ఏపీలో చావోరేవో అన్నట్టు ఎన్నికల వాతావరణం ఉండడంతో.. ప్రస్తుతానికి తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేయడం, ఏవేని పార్టీలకు మద్ధతు ఇవ్వడం.. తదితర అంశాలపై జనసేన అధిష్టానం దృష్టి సారించేందుకు సమయం లేదని కొందరు జనసైనికులు అంటున్నారు. మరోవైపు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున, ఒక పార్టీకి మద్ధతిస్తే వేరొక పార్టీకి టార్గెట్ అయ్యే అవకాశం ఉన్నందునే జేఎస్‌పీ అధిష్టానం కూడా తెలంగాణలో పొత్తు అంశంపై జనసైనికులకు ఇప్పటిదాక డైరెక్షన్ ఇవ్వలేదని జేఎస్‌పీ సీనియర్ నేతలు భావిస్తున్నారు.

నేడు మాంసం విక్రయాలు బంద్

- ఉత్తర్వులు జారీచేసిన జీహెచ్‌ఎంసీ కమిషనర్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మహావీర్ జయంతి సందర్భంగా గ్రేటర్‌లో ఆదివారం మటన్, చికెన్, ఫిష్ బీఫ్ షాప్‌లు మూసివేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. జీహెచ్‌ఎంసీ ఆదేశాలు, నిబంధనలు దుకాణ నిర్వాహకులు పాటించాలన్నారు.

నేటి యూపీఎస్సీ పరీక్షకు ప్రత్యేక బస్సులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో ఆదివారం జరిగే యూపీఎస్సీ పరీక్షలు-2024కు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. డిఫెన్స్ సర్వీస్ ఎగ్జామినేషన్స్ పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని, బస్టాపుల్లో ఆర్టీసీ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. బస్‌స్టేషన్లలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయడంతో పాటు కోఠి-9959226160, రేతిఫైల్ బస్‌స్టేషన్- 9959226154 కమ్యూనికేషన్ సెంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు.

బస్ ట్రిప్పులు యథాతథం

గ్రేటర్‌లో ఎండలు తగ్గడంతో ఆర్టీసీ బస్ ట్రిప్పులు యథాతథంగా నడుపుతున్నామని ఆర్టీసీ ఉన్నతాధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎండల నేపథ్యంలో మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు ట్రిప్పుల సంఖ్య తగ్గించాలనుకున్నా... వాతావరణం చల్లబడడంతో ట్రిప్పులను యథాతథంగా నడుపుతున్నట్లు పేర్కొన్నారు. గ్రేటర్‌జోన్‌లో ఆర్టీసీ 2,839 బస్సులతో రోజూ 30వేల బస్ ట్రిప్పులతో 20 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తుందన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం



చలో నాగర్ కర్నూల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్,ఎంఎస్ఎఫ్ నాయకులు

పంజాగుట్ట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): నాగర్ కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు మాదిగ సామాజిక వర్గం మద్దతు ఉంటుంద ని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు గణేష్ మాదిగ ప్రకటించారు. మాదిగలు అంతా కలిసి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులతో కలిసి గణేష్ మాదిగ మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ఆర్ఎస్ ప్రవీణ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకొని, మూడు దశాబ్దాలుగా మాదిగలను రాజకీయంగా అణచివేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఆయా సంఘాల నాయకులతో కలిసి చలో నాగర్ కర్నూల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్(ఎంఎస్ఎఫ్) జాతీయ నాయకులు వెంకటేష్ మాదిగ, రమేష్ మాదిగ, కురుమయ్య మాదిగ, మాదిగల ఐక్య సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు సందీప్ మాదిగ, మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నవీన్‌రాజ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎంఏ అశ్విన్‌కుమార్ దళవాడి

ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో సీఎంఏ పాత్ర ఎనలేనిది

అమీర్‌పేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): దృఢమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ (సీఎంఏ) పాత్ర ఎనలేనిదని ఐసీఎంఏఐ అధ్యక్షుడు అశ్విన్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం, విధాన నిర్ణేతలు, పరిశ్రమలు, కార్పొరేట్ ప్రపంచానికి బలమైన శక్తిగా ఉన్నారన్నారు. అమీర్‌పేటలోని హోటల్ ఆదిత్య పార్క్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అశ్విన్‌కుమార్ మాట్లాడారు. కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంట్స్ పాత్ర పూర్తిగా రూపాంతరం చెందిందన్నారు. వ్యాపార కార్యకలాపాల్లో నిర్ణయాత్మక పోషిస్తున్నారని తెలిపారు. సమర్థవంతమైన నిర్ణయాలు తీసు కోవడానికి కార్పొరేట్ అనుకూల విధానాలు, పథకాలను సూచించడానికి వీలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీఎంఏఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు సీఎంఏ డాక్టర్ కేసీహెచ్ ఏవీఎస్‌రావు, హైదరాబాద్ చాప్టర్ సీఎంఏ హిమ విద్యా సింగవరపు తదితరులు పాల్గొన్నారు.



బల్కంపేటలోని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు ఫైర్ డ్రిల్‌లో భాగంగా అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

- సనత్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి)



వెంకటేశ్వరకాలనీ డివిజన్ కాంగ్రెస్ నూతన కార్యవర్గాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి ఏర్పాటు చేసి నియామక పత్రాలు అందజేశారు. ఇందులో అధ్యక్షుడు బి.శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

- ఖైరతాబాద్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి)

'సత్యసాయి'లో జాతీయ చేనేత, పట్టు వస్త్ర ప్రదర్శన



ప్రదర్శనలో వస్త్రాలను పరిశీలిస్తున్న మిసెస్ ఇండియా తెలంగాణ క్రౌన్ విజేత పూజిత వినయ్

బంజారాహిల్స్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాలకు ఎప్పటికైనా చాలా ప్రాముఖ్యత ఉంటుందని, అందరూ చేనేత వస్త్రాలను ఆదరించడం అలవర్చుకోవాలని మిసెస్ ఇండియా తెలంగాణ క్రౌన్ విజేత పూజిత వినయ్ అన్నారు. క్రాఫ్ట్ అండ్ వీవర్స్ అసోషియేషన్ గుజరాత్ నేతృత్వంలో శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఏర్పాటైన 6రోజుల జాతీయ చేనేత, పట్టు ఉత్పత్తుల వస్త్ర ప్రదర్శనను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... భారతీయ సంస్కృతిలో సిల్క్ హ్యాండ్‌లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని, నేటికీ వాటిపై వన్నె తగ్గలేదన్నారు. దేశంలోని పలు నగరాల చేనేతకారులు ఒకే వేదికపై హ్యాండ్‌లూమ్ వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు జయేష్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 25వ తేదీ వరకు కొనసాగుతున్న ఈ ప్రదర్శనలో దేశంలోని 14నగరాల నుంచి చేనేత కారులు, చేతివృత్తి బృందాలు తమ సిల్క్ హ్యాండ్‌లూమ్ చీరెలు, డ్రెస్ మెటీరియల్స్ వంటి 50 వేల రకాల వస్త్ర ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు.



టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా సనత్‌నగర్ నియోజకవర్గంలోని తులసినగర్‌లో కానూరి జయశ్రీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో పాల్గొన్న తెలంగాణ టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి సతీష్ కుమార్, నాయకులు బోనాల శ్రీనివాస్ గౌడ్, మురహరి గౌడ్, మల్లేష్, యాదగిరి, తిరుపతి నాయుడు, ప్రసాద్, శ్యామ్, రవి కుమార్, గిరిని శీను, దేవి

- సనత్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి)

జాన్సన్ సెరామిక్‌లో 3 వేల డిజైన్లు



ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న ప్రిజం జాన్సన్ లిమిటెడ్ ఎండీ విజయ్ అగర్వాల్ సీఈఓ శరత్‌చందక్, అజయ్ మిశ్రాత

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): టైలింగ్ రంగంలో సమస్యలను పరిష్కరించడంతోపాటు జీవనశైలి మెరుగుపరచడం, పరిశుభ్రత, పర్యావరణ హితానికి పెద్దపీట వేస్తామని ప్రిజం జాన్సన్ లిమిటెడ్ ఎండీ విజయ్‌అగర్వాల్ అన్నారు. హైటెక్స్‌లోని నోవాటెల్ హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 3 వేలకుపైగా కొత్త టైల్స్ డిజైన్‌లను ప్రదర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పరిశోధనలకు పెద్దపీట వేస్తున్నామని, హెచ్‌అండ్‌ఆర్ జాన్సన్ (ఇండియా) ఆధ్వర్యంలో బిల్డింగ్ మెటీరియల్స్‌ను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తామని చెప్పారు. సంస్థ హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ శరత్‌చందక్, హెచ్‌అండ్ఆర్ అధ్యక్షుడు అజయ్‌మిశ్రా మాట్లాడుతూ అగ్రశ్రేణి బిల్డింగ్ మెటీరియల్స్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. తమ సంస్థదేశంలో అగ్రశ్రేణి టైల్‌కంపెనీలలో ఒకటిగా పేరుగాంచిందన్నారు. సంస్థకు 66ఏళ్ల చరిత్ర ఉందని, టైల్స్, శానిటరీవేర్, బాత్ ఫిట్టింగ్‌లు ఇంజనీర్డ్ మార్బుల్, క్వార్ట్‌లను అందుబాటులో ఉంచామని తెలిపారు.



యాదవ బస్తీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అభ్యర్థి జి.నివేదిత, మాజీ బోర్డు మెంబర్ నళిని కిరణ్

కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ ప్రచారం

మారేడుపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత శనివారం కంటోన్మెంట్ బోర్డు 4వ వార్డు మాజీ బోర్డు మెంబర్ పి.నళిని కిరణ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బోర్డు పరిధిలోని పికెట్, ముదిరాజ్ బస్తీ, యాదవ బస్తీ, దోబీ బస్తీలలో గడపగడపకు వెళ్ళి స్థానిక ఓటర్లను కలుస్తూ... తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత మాట్లాడుతూ... దివంగత నేత సాయన్న చేసిన అభివృద్ధితోపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలే కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురుతుందన్నారు. ఈ ప్రచారంలో సీనియర్ నాయకులు పి.నళినికిరణ్, వినోద్, గంగారాం, పి.సంతోష్, పి.శ్రీకాంత్ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు మాంసాహార దుకాణాలు బంద్

ఉత్తర్వులు జారీచేసిన జీహెచ్ఎంసీ కమిషనర్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మహావీర్ జయంతి సందర్భంగా గ్రేటర్‌లో ఆదివారం మటన్, చికెన్, ఫిష్, బీఫ్ షాప్‌లు మూసివేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. జీహెచ్ఎంసీ ఆదేశాలు, నిబంధనలు దుకాణ నిర్వహాకులు పాటించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వేసవి శిక్షణా తరగతులు

అడ్డగుట్ట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో రెమీడియల్ సెంటర్‌లో చదువుకుంటున్న విద్యార్థులు వేసవి సెలవులకు ఇంటికే పరిమితంగాకుండా



విద్యార్థినికి మోటివేషన్ కల్పిస్తున్న ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు

శిక్షణా తరగతులకు హాజరుకావాలని ఎం.వీ ఫౌండేషన్ కార్యదర్శి సువర్ణ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలలో ఎంవీ ఫౌండేషన్ సంస్థ నుంచి కొంతమంది విద్యార్థులు రేమీడియల్ సెంటర్‌లో చదువుకుంటున్నారు. పరీక్షలు పూర్తికాగానే ఇంటికే పరిమితం గాకుండా వేసవి సెలవుల్లో తాము నిర్వహించే శిక్షణా తరగుతులకు హాజరు కావాలని శనివారం సంస్థ ప్రతినిధులు సౌజన్య, శోభ, లావణ్యలతోపాటు పలువురు బృందం ఇంటింటికీ వెళ్లి తమ పిల్లల్ని బడికి పంపించాలని కోరారు.

సికింద్రాబాద్‌లో బాలిక అదృశ్యం

జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన గోపాలపురం పోలీసులు

అడ్డగుట్ట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : తన కుమార్తె కనిపించడంలేదని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందటంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేయగా, గోపాలపురం పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదుచేశారు.



సాయినీత

గోపాలపురం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. హైద్రాబాద్ బోరబండకు చెందిన శ్రీను కుమార్తె కే.సాయినీత (12) నాట్కో ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతుంది. కొద్ది రోజుల క్రితం మహబూబ్‌నగర్‌లోని మక్తల్‌లో ఉంటున్న అమ్మమ్మ బైబమ్మ ఇంటికి వెళ్లింది. తిరిగి శుక్రవారం బోరబండకు వద్దామని రైలు ఎక్కిన సాయినీత సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలు దిగిన వెంటనే అక్కడ ఓ వ్యక్తి నుంచి ఫోన్ అడిగి తన తండ్రి శ్రీనుకు ఫోన్ చేసి తాను సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగానని సమాచారం ఇచ్చింది. తన చేతిలో డబ్బులు లేవని, వంద రూపాయలు పంపించమని కోరగా తండ్రి వెంటనే ఆ వ్యక్తికి వంద రూపాయలు ఫోన్‌పేలో పంపించగా ఆ వ్యక్తి తన జేబులో నుంచి సాయినీతికి వంద రూపాయాలు ఇచ్చాడు. ఆ తరువాత సాయినీత అనుమానాస్పదస్థితిలో అదృశ్యమైంది. సాయినీత ఎంతసేపటికీ ఇంటికీ రాకపోవడంతో శ్రీను తన కుమార్తె కనిపించడంలేదని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసిన అక్కడి పోలీసులు ఈ కేసును గోపాలపురం పోలీస్ స్టేషన్‌కు బదిలీచేశారు. గోపాలపురం పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ మిస్సింగ్ కేసు నమోదు చేసి, సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ బాలిక ఆచూకీ తెలిస్తే వెంటనే 8712660248 నెంబరుకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సికింద్రాబాద్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అడ్డగుట్ట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రెజిమెంటల్‌బజారులో చనిపోయి ఉన్న ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. ఈ సంఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.



ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజారులోని పద్మ రెసిడెన్సి లాడ్జి వద్ద గుర్తుతెలియని 45 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉన్నాడు. ఆ సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న గోపాలపురం పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ శ్రీధర్ వెంటనే పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందించి, మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ వ్యక్తి ఫోటో గుర్తించి గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. మృతుడు నీలం రంగు ప్యాంట్, ఆరెంజ్ రంగు చొక్కా ధరించాడని తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బల్కంపేటలోని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు ఫైర్ డ్రిల్‌లో భాగంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించిన అగ్నిమాపకశాఖ అధికారులు.

బంగారు భవిష్యత్‌కు కృషి

- ప్రజాపాలన దరఖాస్తుదారులందరికీ పథకాలు అందిస్తాం
- ఇందిరమ్మ కమిటీల ద్వారా ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం
- ఐదేళ్లలో కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ అభివృద్ధికి ఒక్క రూపాయి తేలేదు
- స్థానిక ఎమ్మెల్యే రౌడీలను పెంచాడు.. అమాయకులపై కేసులు పెట్టించాడు
- పోపు డబ్బాలకు ఆశపడి భవిష్యత్తు లేకుండా చేసుకోవద్దు : దానం



జూబ్లీహిల్స్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలలో ఇప్పటికే ఐదు గ్యారంటీలు అందించిందని, భవిష్యత్తులో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇళ్లులేనివారికి ఇళ్లు, స్థలం ఉన్నవారికి ఇళ్లు కట్టుకునేందుకు డబ్బులు, పదిలక్షల ఆరోగ్య బీమా పథకం ఇలా మీ భవిష్యత్తుకు బంగారు బాట వేసేలా ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేస్తుందని, ఈ ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా కృషి చేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. శనివారం యూసుఫ్‌గూడలోని మహమూద్ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ నాయకుడు వి.నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ వారు రాష్ట్రానికి చేసింది శూన్యమన్నారు. కిషన్ రెడ్డి ఒక రకంగా మాట్లాడతారు, బండిసంజయ్ ఒక మాట మాట్లాడతాడు. ఐదేళ్లలో కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్‌కు ఒక్క పథకం తెచ్చారా, వంద కోట్లు నిధులు తెచ్చారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వారు రేవంత్‌రెడ్డి దిగిపో అంటూ మాట్లాడుతున్నారు. దీనిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేను హైటెన్షన్ పవర్ వంటివాడిని ముట్టుకుంటే మాడిపోతారని సమాధానం చెప్పాడన్నారు. ఇక్కడ స్థానిక ఎమ్మెల్యే ఉన్నాడు ఆయన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రౌడీషీటర్‌లను పెంచాడు, అమాయకులపై కేసులు పెట్టించాడు. ఇక్కడ పోలీస్ స్టేషన్‌లలో ఎప్పుడు చూసినా ఇక్కడి ఎమ్మెల్యే పెట్టించిన కేసుల గోలే ఎక్కువన్నారు. అలాంటి వారికి భయపడొద్దు, మీవెంట మేమున్నాం, ఎవరికీ భయపడాల్సిన పని లేదు. మీ జోలికొస్తే వారి అంతుచూస్తామన్నారు. ఏదైనా ఉంటే బేగంబజార్ పోయి హోల్‌సేల్‌లో డబ్బాలు కొనక్కొస్తాడు, ఆ డబ్బాలు ఆడపడుచులకు ఇస్తాడు. ఈ డబ్బాలు చూసి మోసపోకండి, ఎంతో విలువైన పథకాలు మీకు అందించి మీ జీవితం బంగారు బాట వేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ప్రజాపాలనలో వచ్చిన 64వేల దరఖాస్తుదారులకు ప్రతిఒక్కరికీ ఏ పథకానికి అర్హులైతే ఆ పథకం తప్పక అందిస్తామన్నారు. నేను ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచాను, మూడుసార్లు ఆసిఫ్‌నగర్‌లో, మూడుసార్లు ఖైరతాబాద్‌లో గెలిచాను. ఎక్కడున్నా ప్రజల వెంట ఉన్నానేకానీ, ఏ రోజూ ఒక్కరిపై కూడా కేసు పెట్టలేదన్నారు. ఏ రోజైనా ప్రజలకు నిరంతరంగా ఉన్నాను కాబట్టే ప్రజలు నన్ను ఆదరించారన్నారు. ఈ ఎన్నికల్లో అందరం ఏకతాటికి వచ్చి సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేసేవిధంగా అందరం కలసి కట్టుగా కృషి చేసి విజయం సాధిద్దామన్నారు. సికింద్రాబాద్ గెలుపును రేవంత్‌రెడ్డికి అందించి మరింత ముందుకు పోదామన్నారు. రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ, రాష్ట్రానికి బీజేపీ పార్టీ చేసింది చెప్పాలన్నారు. ఐదేళ్లలో కిషన్‌రెడ్డి ఎందుకు నిధులు తీసుకురాలేదని ప్రశ్నించారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడగటానికి వస్తున్నాడన్నారు. నవీన్‌యాదవ్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో మహిళలు ముందుండి ప్రచారం చేసి మన భవిష్యత్తును గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ అజారుద్దీన్, చిన్నశ్రీశైలం యాదవ్, ఉపేందర్‌రెడ్డి, భవానీశంకర్, కార్పొరేటర్‌లు సీఎన్.రెడ్డి, బాబా ఫస్సియుద్దీన్, వనం సంగీతయాదవ్, నాయకులు మురళీగౌడ్, మైనార్టీ నాయకుడు ఖురేషి, షరీఫ్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

అమరనాథ్ యాత్రికులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ

అడ్డగుట్ట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అమరనాథ్‌కు వెళ్లే యాత్రీకులకు గాంధీ ఆస్పత్రి వైద్యులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీప్రక్రియ ప్రారంభించారు. గాంధీ ఆస్పత్రిలో శనివారం మొదటి అంతస్తులోని ఎంఆర్‌డీ విభాగం పక్కన నియమించిన మెడికల్ బోర్డు ద్వారా మొదటి రోజు 120 మంది యాత్రికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను జారీ చేశామని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు తెలిపారు. ఈ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీలో ఆర్థోపెడిక్ విభాగాధిపతి ప్రొఫెసర్ వాల్య, కార్డియాలజీ ప్రొఫెసర్ నితిన్ కాబ్రా, పల్మనాలజీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ సునిల్ కుమార్‌లు ఉన్నారు.



ఫిటినెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్న గాంధీ వైద్యులు

యాత్రీకులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ అవసరం ఉంటే తమ వెంట ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు ఫోటోలతో కూడిన దరఖాస్తులను మొదటి అంతస్థులో ఎంఆర్‌డీ విభాగంలో అందజేయాలని సూపరింటెండెంట్ చెప్పారు. ప్రతి బుధ, శనివారం రెండు రోజుల్లో మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా యాభై ఏళ్ల పైబడినవారు ఉంటే మోకాళ్లకు సంబంధించిన ఎక్స్‌రేలను అదనంగా దరఖాస్తు చేసుకోవాలని వైద్యులు సూచించారు.

ఈ సర్టిఫికెట్లు లేకుండా అమర్‌నాథ్ పుణ్యక్షేత్రంలోని జమ్మూకాశ్మీర్‌లో ఉన్న కేంద్రబలగాలు చెకింగ్ పాయింట్ వద్ద యాత్రీకులను అనుమతించరని తెలిపారు.

పురోహితులను, పూజారులను అవమానపరిస్తే సహించేదిలేదు

- **తెలంగాణ బీజేపీ ధార్మికపరిషత్ కన్వీనర్ సూర్యప్రకాష్**

తార్నాక, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పురోహితులను, పూజారులను అవమానపరిస్తే సహించేదిలేదని తెలంగాణ బీజేపీ ధార్మికపరిషత్ కన్వీనర్ సూర్యప్రకాష్ అన్నారు. ఈమేరకు శనివారం తార్నాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని పిఠాపురం మూలవరుస గ్రామంలో వివాహం చేస్తున్న పురోహితునిపై జరిగిన అవమానకరం, సభ్యసమాజం తలదించుకునేవిధంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా దాడి చేసిన దృశ్యాలను రికార్డు చేసి సోషల్ మీడియాలో వైరల్ చేయడం చాలా దురదృష్టకరమని తీవ్రంగా మండిపడ్డారు.

ఇటీవల దేవాలయాల్లో పూజారులను, పురోహితులను కొన్ని దుష్టశక్తులు ఉద్దేశ్యపూర్వకంగా అవమానపరచడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, ఇటువంటి దాడులను తెలంగాణ ధార్మికపరిషత్ అడ్డుకుని పూజారులకు, పురోహితులకు అండగా నిలుస్తుందని భరోసాను ఇచ్చారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి దాడికి పాల్పడిన దుండగులను వెంటనే అరెస్టు చేసి, చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కంటోన్మెంట్ ప్రజలు బీఆర్ఎస్‌తోనే ఉన్నారు

బోయినపల్లి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన పథకాలతో పాటు తన తండ్రి దివంగత ఎమ్మెల్యే సాయన్న చేసిన సేవలను గుర్తిస్తున్న ప్రజలు బీఆర్ఎస్ పార్టీపైన ఉన్న అభిమానంతో బీఆర్ఎస్‌తోనే



ఎన్నికల ప్రచార రథాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు

ఉన్నారని, తాను ఎక్కడకు వెళ్ళినా ప్రజలు ప్రేమాభిమానాలు చూపిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకుంది. ఈ నేపథ్యంలో కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఉప ఎన్నికల ప్రచార రథాల ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం బోయినపల్లిలోని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డితో కలిసి కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత ప్రచార రథాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్, అనిత ప్రభాకర్, నళిని కిరణ్, భాగ్యశ్రీ శ్యాంకుమార్, లోకనాధం, బోయినపల్లి మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్ టి ఎన్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆకుల హరి, నర్సింహ యాదవ్ పాల్గొన్నారు.



ముప్పిడి మధుకర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక

బోయినపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కేబుల్ ఆపరేటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ముప్పిడి మధుకర్‌తోపాటు కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన కొందరు నాయకులు శనివారం ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ముప్పిడి మధుకర్‌తోపాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భాస్కర్, శేఖర్ ముదిరాజ్, సిద్ది, సతీష్, నర్సింగ్‌రావు, భరత్, నాగినేని సరిత, నీరజ్‌లకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేష్‌తో పాటు కంటోన్మెంట్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మరు

మల్లేశ్వరపు రాజేశ్వరి



సికింద్రాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని కులం పేరుతో, మతం పేరుతో చీల్చడమే బీజేపీ మేనిఫెస్టో అని, బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనంటూ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరని బీజేపీ ఓబీసీ మోర్చా ఎంబీసీ సెల్ రాష్ట్ర కోకన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి అన్నారు. బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తారంటూ ఆ పార్టీలు చేస్తున్న అసత్య ప్రచారాలు అర్థరహితంగా ఉన్నాయని శనివారం మెట్టుగూడలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ 60 ఏళ్ల అధికారంలో ఉన్నప్పుడు కుల గణన, ఎస్సీ వర్గీకరణ ఎందుకు చేయలేదని ఆమె ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగం పట్ల గౌరవం లేదని ఆమె విమర్శించారు. దేశం సురక్షితంగా, సుభిక్షితంగా ఉండాలంటే సమర్థవంతమైన మోదీ నాయకత్వంలోనే సాధ్యమని భారత దేశ ప్రజలు నమ్ముతున్నారని పేర్కొన్నారు.

కమలానికి దూరంగా జనసేన!

- సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో స్తబ్దుగా ఉన్న జనసైనికులు
- ప్రచారంలో బీజేపీ నేతలు తమను కలుపుకోవడం లేదని ఆవేదన
- మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుతో దగ్గరైన రెండు పార్టీలు
- పార్లమెంట్ ఎన్నికలకు వచ్చేసరికి ఎవరికి వారే అన్నట్లుగా పార్టీల తీరు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీకి, జనసేన పార్టీకి నడుమ దూరం పెరిగిందా అంటే.. అవుననే అంటున్నారు జనసైనికులు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కమలం పార్టీ నేతలు, జనసైనికులు కలిసి ప్రచారం నిర్వహించగా, వచ్చే నెల (మే13న)లో జరగనున్న సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో మాత్రం రెండు పార్టీలు ఎవరి దారి వారిదే అన్నట్లుగా వ్యవహరిస్తుండడం గమనార్హం. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీజేపీతో కలిసి ప్రచారంలో పాల్గొనేందుకు జనసేన నేతలు, కార్యకర్తలు ముందుకు వచ్చినప్పటికీ, కమలం పార్టీ నేతల నుంచి తగురీతిన ఆహ్వానం అందలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాక్షాత్తు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రాతినిథ్యం వహిస్తున్న సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోనే తాము ఆ పార్టీతో కలిసి పని చేసే పరిస్థితులు ఏర్పడకపోవడం పట్ల కొందరు జనసైనికులు బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ఎన్నికల్లో బీజేపీతో కలిసి పనిచేసే విషయమై తమ పార్టీ అధిష్టానం నుంచి ఆదేశాలు అందకపోవడం వల్లనే జనసైనికులు స్తబ్దుగా ఉన్నట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

2019లో జనసేన అభ్యర్థికి 10వేల ఓట్లు.!

గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి జనసేన పార్టీ సొంతంగా అభ్యర్థిని నిలిపింది. ప్రస్తుత ఆ పార్టీకి తెలంగాణ ఇన్‌చార్జిగా ఉన్న ఎన్.శంకర్ గౌడ్ గత ఎన్నికల బరిలో నిలవగా ఆయనకు 9,683 ఓట్లు వచ్చాయి. ఈ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని సికింద్రాబాద్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, నాంపల్లి, సనత్‌నగర్, ముషీరాబాద్ ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చి సెటిలైనవారు చెప్పుకోదగిన సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. ఏపీ ఓటర్లతో పాటు తెలంగాణలోనూ మెగా కుటుంబానికి, జనసేనానికి పెద్దసంఖ్యలో అభిమానులు ఉన్నారని, గత ఎన్నికలతో పోల్చితే ఈ దఫా జనసేన పార్టీ మద్దతుదారుల సంఖ్య బాగా పెరిగిందని జనసేన నేతలు భావిస్తున్నారు. మొత్తంగా సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో కలిపి 40 నుంచి 50 వేలమంది జనసేనకు మద్దతు తెలిపేవారున్నట్లు అంచనా వేస్తున్నారు. బీజేపీ పార్టీ నుంచి జనసైనికులకు సరైన పిలుపులు లేకపోవడంతో జేఎస్‌పీకి మద్దతు తెలిపేవారంతా చీలిపోయి బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు వేసే పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం సికింద్రాబాద్ పార్లమెంట్‌కు నెలకొన్న ముక్కోణపు పోటీలో బీజేపీ అభ్యర్థికి జనసేన మద్దతుదార్ల ఓట్లు ఎంతో అవసరమని, ఇప్పటికైనా తమను కలుపుకొని ముందుకు వెళ్లకుంటే గెలుపుపై ప్రభావం చూపే అవకాశం ఉందని జనసేన పార్టీ సీనియర్ నేతలుఅంటున్నారు.

ఏపీ ఎన్నికలపై తెలంగాణ జన'సేన' ఫోకస్

సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ నేతలు జనసైనికులను పట్టించుకోకపోవడంతో.. ఈ నియోజకవర్గం పరిధిలోని జేఎస్‌పీ మద్దతుదారులు ఏపీలో జరగబోయే ఎన్నికలపై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో 20కిపైగా అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ స్థానాల్లో జేఎస్‌పీ పోటీ చేస్తుండంతో.. ఆయా నియోజకవర్గాల్లో జనసేన అభ్యర్థుల గెలుపుకోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా పనిచేస్తున్నట్లు సమాచారం. ఏపీలో జనసేన గెలుపుకోసం తెలంగాణ ప్రాంతానికి చెందిన జనసైనికులు కూడా ఆసక్తిగా పనిచేస్తున్నట్లు స్థానిక నేతలు చెబుతున్నారు. మరోవైపు ఏపీలో చావోరేవో అన్నట్లు ఎన్నికల వాతావరణం ఉండడంతో.. ప్రస్తుతానికి తెలంగాణ ఎన్నికల్లో పోటీచేయడం, ఏవేని పార్టీలకు మద్దతు ఇవ్వడం..తదితర అంశాలపై జనసేన అధిష్టానం దృష్టి సారించేందుకు సమయంలేదని కొందరు జనసైనికులు అంటున్నారు. మరోవైపు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున, ఒక పార్టీకి మద్దతిస్తే వేరొక పార్టీకి టార్గెట్ అయ్యే అవకాశం ఉన్నందునే జేఎస్‌పీ అధిష్టానం కూడా తెలంగాణలో పొత్తు అంశంపై జనసైనికులకు ఇప్పటిదాక డైరెక్షన్ ఇవ్వలేదని జేఎస్‌పీ సీనియర్ నేతలు భావిస్తున్నారు.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని టీడీపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు గండికోట విజయ్ కుమార్ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం మాణికేశ్వర్ నగర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి జీ.ఎం.రమేష్, ఆలకుంట బుచ్చయ్య, గండికోట గిరిబాబు, ప్రభాకర్, ఎండీ నాసర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

\- తార్నాక, ఆంధ్రజ్యోతి



నారా చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా సనత్‌నగర్ నియోజక వర్గంలోని తులసీనగర్‌లో కానూరి జయశ్రీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో తెలంగాణ టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు శ్రీపతి సతీష్‌కుమార్, నాయకులు బోనాల శ్రీనివాస్ గౌడ్, మురహరిగౌడ్, మల్లేష్, యాదగిరి, తిరుపతి నాయుడు, ప్రసాద్, శ్యామ్, రవి కుమార్, గిరిని శీను, దేవి తదితరులు.

\- సనత్‌నగర్, ఆంధ్రజ్యోతి



ఫైర్ సర్వీస్ క్లోజింగ్ సెరిమనీ సందర్భంగా ఏర్పాట్లపై సనత్‌నగర్ ఫైర్ స్టేషన్‌లో సమీక్షా సమావేశం నిర్వహించిన ఫైర్ సర్వీస్ అధికారులు.



సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తున్న సీడీఏ టెక్నాలజీ డైరెక్టర్ అశోక్

సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

- **సీడీఏ టెక్నాలజీ డైరెక్టర్ అశోక్**

బోయినపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని, లేదంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని సీడీఏ టెక్నాలజీ డైరెక్టర్ అశోక్ పేర్కొన్నారు. శనివారం బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీఎంఆర్ స్కూల్‌లో స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఎంఆర్ స్కూల్ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సైబర్ నేరాల భద్రతా చర్యలకు సంబంధించిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీడీఏ టెక్నాలజీ డైరెక్టర్ అశోక్ మాట్లాడుతూ.. ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. ఈ విషయాన్ని తల్లితండ్రులకు తెలపాలన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు డయల్ చేసి వెంటనే తెలియజేయాలన్నారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుందని అన్నారు. ఇటీవలకాలంలో మహిళలు పిల్లలను టార్గెట్ చేసుకుని సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. ఇంటర్నెట్‌ను పరిమితికి మించి వాడకూడదని సూచించారు. సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి డబ్బులు కాజేస్తున్నారని గుర్తుచేశారు. ఆన్‌లైన్ ద్వారా లావాదేవాలు నడిపేవారు కొత్త వ్యక్తుల మాటలను నమ్మరాదని, తెలియని మెసేజ్‌లపై క్లిక్‌చేయరాదని తెలిపారు. సైబర్ నేరగాళ్లు మాయ మాటలు చెబుతూ బహుమతులు వచ్చాయని, లాటరీ తగిలిందని, లోన్లు ఇస్తామని ఇతరత్రా ఆశచూపి ఆన్‌లైన్ ద్వారా డబ్బులకు ఎరవేస్తారని, అటువంటి వ్యక్తులు పంపే మెసేజ్‌లకు స్పందించరాదని అవగాహన కల్పించి తమ తల్లితండ్రులకు ఈ విషయాలు తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎస్‌కె.రెడ్డి, స్టార్ ఫౌండేషన్ చైర్మన్ లతారెడ్డి, సెక్రటరీ తన్మయ్ రెడ్డి, ప్రిన్సిపాల్ లిజి బెనడిక్ట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కూడా సీఎస్‌సీ సెంటర్లు ఓపెన్

- **జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్**

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రాపర్టీ ట్యాక్స్‌పై 5 శాతం రిబెటుతో చెల్లించే వెసులుబాటు ఇంకా 10 రోజులు మాత్రమే ఉన్నందున ఆదివారం కూడా జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్, సర్కిళ్లలోని సిటిజన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీలు) తెరిచే ఉంటాయని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు సెంటర్లు అందుబాటులో ఉంటాయని, ఇప్పటి వరకు 5 శాతం రిబెట్ పొందనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కాగా, ఇప్పటి వరకు 4.50 లక్షల మంది రూ.3.70కోట్లు చెల్లించారని, గతేడాది ఎర్లీ బర్డ్‌లో రికార్డుస్థాయిలో రూ.760 కోట్ల ఆస్తి పన్ను ఆదాయం వచ్చిందని కమిషనర్ తెలిపారు.